సాక్షి
జగిత్యాల
మంగళవారం । 2 । మే । 2023



వైభవంగా చందనోత్సవం

ధర్మపురి : నృసింహుని నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరోరోజు సోమవారం అర్చకులు చందనోత్సవం వైభవంగా నిర్వహించారు.



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జగిత్యాల : స్థానిక అతి పురాతన శ్రీవేణు గోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉండి, వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్యపరీక్షలు చేయించుకోవాలి



శిబిరంలో కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: ప్రతిఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. కార్మికశాఖలో గుర్తింపు పొందిన భవన నిర్మాణ రంగ కార్మికులకు మేడే సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ప్రభుత్వం తరఫున 50కిపైగా వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. టీబీ, షుగర్, హెచ్‌ఐవీ, మూత్రపిండం, ఊపిరితిత్తులు సంబంధిత పరీక్షలు అందరూ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లత, జిల్లా సహాయ కార్మిక అధికారి కృష్ణసాగర్, క్యాంప్ ఇన్‌చార్జి శ్రీనివాస్, రఫీ, భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర న్యాయం



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పోలీసుల లక్ష్యమని ఎస్పీ భాస్కర్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది అభాగ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారితో మాట్లాడారు. భూ సంబంధిత, భార్యాభర్తల విభేదాలు, ఫైనాన్స్ సమస్యలపై తమకు ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు. మేడిపల్లికి చెందిన ఇద్దరు.. 8 మందిని గల్ఫ్‌కు పంపిస్తామని మోసం చేసిన ఘటనపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డిని ఆదేశించామని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువయ్యేందుకు సమస్యలు పరిష్కరిస్తున్నామని ఎస్పీ భాస్కర్ తెలిపారు.

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

జగిత్యాల: ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అనేక వ్యయప్రయాసలకోర్చి వస్తారని, అధికారులు శాఖల వారీగా అర్జీలు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అర్జీలు పెండింగ్‌లో ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసందర్భంగా 21 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

మేడిపెల్లి: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకురాలు తుల ఉమ డిమాండ్ చేశారు. పోరుమల్లలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం, దెబ్బతిన్న పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. మే డే సందర్భంగా ఉపాధిహామీ కూలీలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నాయకులు బోంగోని రాజగౌడ్, ఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

సీటెట్-2023 పరీక్ష కేంద్రం కొనసాగించాలి

కథలాపూర్(వేములవాడ): సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్)-2023 పరీక్ష కేంద్రాన్ని కరీంనగర్‌లోనే యథావిధిగా కొనసాగించాలని ముగ్గురు ట్రెయినీ టీచర్లు ఇటీవలకరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎంపీ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం లేఖ రాశారు. సీటెట్-2022 పరీక్ష కేంద్రం కరీంనగర్‌లో కేటాయించారని, 2023లో దానిని తొలగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. కరీంనగర్‌లో పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని ఎంపీ తన లేఖలో విన్నవించారు.

'ఎర్లీబర్డ్' ఆదాయం రూ.11లక్షలు

మెట్‌పల్లి(మెట్‌పల్లి): బల్దియాలో చేపట్టిన ఎర్లీబర్డ్ పథకం ద్వారా ఏప్రిల్ 30లోపు ఆస్తి పన్ను చెల్లించిన యజమానులకు ప్రభుత్వం 5శాతం రాయితీ కల్పించిన సంగతి తెలిసిందే. దీనికింద 323 మంది ఆస్తిపన్ను చెల్లించగా, మున్సిపల్ ఖజానాకు రూ.11,93,645 ఆదాయం సమకూరిందని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ సోమవారం తెలిపారు.

శ్రమంతా వృథా



వెల్గటూర్ : కొనుగోలు కేంద్రంలో వర్షపునీటిలో మునిగిన ధాన్యం బయటకు తీస్తున్న రైతులు



ఇతడి పేరు సిరికొండ నర్సయ్య. స్వగ్రామం సింగరావుపేట. తనకున్న ఐదెకరాల్లోని వరిపైరు కోశాడు. దాదాపు 100 క్వింటాళ్ల ధాన్యాన్ని పదిరోజుల క్రితం కొనుగోలు కేంద్రంలో పోశాడు. అప్పట్నుంచి రోజూ వర్షం కురుస్తోంది. వడ్లు తడవకుండా కవర్లు కప్పడం, ఆ తర్వాత ఆరబెట్టడం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురవడంతో కవర్లు గాలికి కొట్టుకుపోయాయి. దాదాపు 3 క్వింటాళ్ల ధాన్యం వర్షపు నీళ్లలో కలిసిపోయింది.

ఆరబెట్టడం ఇబ్బందిగా ఉంది



చల్‌గల్ కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి ఇరవై రోజులవుతుంది. రోజూ వర్షం కొడుతుంది. కవర్లు కప్పినా వడ్లు తడుస్తున్నయి. ఆరబెట్టడం ఇబ్బందిగా ఉంది.

– కాశివేని గంగమల్లు, రైతు, ఉప్పరిపేట

- ఏకధాటిగా కురుస్తున్న అకాల వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వర్షపు నీటిలో కొట్టుకుపోయిన వడ్లు
- డ్రైనేజీలు, కల్లాలు, మట్టిలో కలిసిన ధాన్యం
- కన్నీటిపర్యంతమవుతున్న అన్నదాతలు

పంట నష్టం వివరాలు

పంట	నష్టం(ఎకరాల్లో)
వరి	24,146
మొక్కజొన్న	255
నువ్వు	2,566
జొన్న	105
మామిడి	32,722

త్వరగా తూకం వేయాలె



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి ఇరవై రోజులవుతుంది. ఎప్పుడు కొంటరో తెలియడం లేదు. ఇబ్బందులు లేకుండా వెంటనే తూకం వేయాలి. రైతులను ఆదుకోవాలి.

– తోడేటి తిరుపతి, రైతు, హస్నాబాద్

జగిత్యాలఅగ్రికల్చర్: సుమారు పదిరోజులుగా రోజూ వర్షం కురుస్తోంది. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. కొంత వర్షపునీటిలో కొట్టుకుపోతోంది. కాలువగట్లు, డ్రైనేజీల్లోకి చేరుతోంది. రహదారులపై మట్టిలో కలిసిపోతోంది. కళ్లెదుటే శ్రమంతా మట్టిపాలు కావడంతో అన్నదాత కన్నీటిపర్యంతమవుతున్నాడు.

నీళ్లు తొలగించేందుకు నానాకష్టాలు..

- కొనుగోలు కేంద్రాల్లో స్థలం కొరత తీవ్రంగా ఉంది. పక్కపక్కనే ధాన్యం కుప్పలు ఉండడంతో వర్షపునీరు నిలిచిపోయింది.
- వర్షపునీటి ప్రవాహానికి వడ్లు కొట్టుకుపోయి మురుగునీరు కాలువలు, కాలువగట్లు, వ్యవసాయ బావుల్లోకి కొట్టుకుపోతోంది.
- చల్‌గల్ యార్డులో 10 వేల క్వింటాళ్ల పైనే ధాన్యం వర్షంలో తడిసి ముద్దయ్యిందని అధికారులు తెలిపారు.
- కొన్నిచోట్ల రైతులు తట్టలు, బకెట్లతో వర్షపు నీటిని ఎత్తిపోసే పనుల్లో నిమగ్నమయ్యారు.
- మరికొందరు ధాన్యం కుప్పల మధ్య కాలువలు తీసి వర్షపునీటిని బయటకు పంపిస్తున్నారు.

నిలిచిన కొనుగోళ్లు

- ధాన్యం కొనుగోళ్ల ప్రారంభంలోనే అకాల వర్షాలు కొనుగోళ్లకు ఆటంకంగా మారాయి.
- ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షంతో ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా స్తంభించాయి.
- మార్చి 25 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు కురిసిన వర్షాలతో జిల్లావ్యాప్తంగా 59,794 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి.





సారంగాపూర్ : అర్పల్లిలో వర్షపు ధాటికి మట్టిపాలైన వడ్లు, గొల్లవాడలో బురదపాలైన ధాన్యం



జగిత్యాలరూరల్ : పొరండ్లలో ..

అన్నదాత కన్నీరుమున్నీరు..

జగిత్యాలరూరల్: మోరపల్లి, తాటిపల్లి, వెల్దుర్తి, కండ్లపల్లి, పొరండ్ల, హన్మాజీపేట, హైదర్‌పల్లి, గుల్లపేట, కల్లెడ, అనంతారం, బాలపల్లి, చల్‌గల్, ధరూర్, తిప్పన్నపేట, హస్నాబాద్ గ్రామాల్లో కురిసిన భారీవర్షంతో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నీటమునిగింది. కొంత వరదలో కొట్టుకుపోయింది. రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మామిడికాయలు నేలరాలడంతో తీవ్రనష్టం వాటిల్లింది. నువ్వు పంట నేలవాలింది.



నర్సింగాపూర్‌లో తడిసిన ధాన్యం

టార్పాలిన్లు దొంగలపాలు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): గోధూర్‌లో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు దొంగలపాలయ్యాయి. ఫలితంగా వర్షానికి వడ్లు తడిసిపోయాయి. ఇబ్రహీంపట్నం, తిమ్మాపూర్‌లోని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు లేవు. మండలంలోని 12 కేంద్రాల్లో సుమారు 5,477 క్వింటాళ్ల ధాన్యం తడిసిందని అధికారుల అంచనా.



వడ్లు కొట్టుకుపోయినయ్



నాకున్న ఐదెకరాల్లో పండించిన నాలుగు ట్రాక్టర్ లోడ్ల వడ్లను గోధూర్ కొనుగోలు కేంద్రంలో పోసిన. వర్షంతో ట్రాక్టర్‌లోడ్ వడ్లు వరదలో కొట్టుకుపోయినయ్. ధాన్యం బురదపాలు కావడం ఆవేదన కలిగించింది.

– గడ్డం వెంకటస్వామి, రైతు, గోధూర్

తేమ వచ్చింది



పదిరోజుల కింద మూడు ట్రాక్టర్ లోడ్ల వడ్లను కొనుగోలు కేంద్రంలో పోసిన. రోజూ కొట్టేవానకు తేమ వచ్చింది. కొనుగోలు చేయడంలేదు. వడ్లు తడవకుండా కప్పిన కవర్లు దొంగలు ఎత్తుకుపోయిండ్రు.

– గడ్డం నర్సింగ్, రైతు, గోధూర్

కొట్టుకు పోయిన ధాన్యం



సారంగాపూర్: అర్పపల్లిలో వర్షానికి కొట్టుకుపోయి మట్టిలో చేరిన వడ్లు

సారంగాపూర్(జగిత్యాల): అర్పపల్లిలో నెల క్రితం పోసిన ధాన్యం ఇప్పటివరకు కొనుగోలు చేయలేదు. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. మరికొంత తడిసి మొలకొచ్చింది. గొల్లవాడ కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిండిపోయింది. స్థలం కొరతతో కొందరు రైతులు కల్లాల్లో ధాన్యం నిల్వచేయగా, దానిచుట్టూ వర్షపునీరు చేరి తడిసింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ప్రతీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసియి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా, అధికారుల మధ్య సమన్వయం కొరవడి ఇంకా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదని, ప్రతీ కొనుగోలు కేంద్రానికి ఒక అధికారిని నియమించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అర్పపల్లిలోని రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి రైతులను ఓదార్చారు.

మళ్లీ వర్షం.. తడిసిన ధాన్యం



కథలాపూర్ : పెగ్గెర్లలో బురదలో చేరిన వడ్లు చూపుతున్న రైతు దంపతులు

కథలాపూర్(వేములవాడ): వివిధ గ్రామాల్లో సోమవారం వేకువజామున భారీవర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం కాస్తా ఎండఉందని వడ్లు ఆరబెట్టేందుకు టార్పాలిన్లు తొలగించగా.. గంటలోపే మళ్లీ వర్షం కురిసి ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షం ఎప్పుడొస్తుందో తెలియక కుప్పల వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఊట్‌పెల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో సజ్జ పంట నేలవాలింది. ధాన్యం తడిసి రంగుమారింది.

నేలవాలిన వరిపైరు



పెగడపల్లిలో నేలవాలిన వరిపైరు

పెగడపల్లి(ధర్మపురి): ఈదురుగాలులతో కూడిన భారీవర్షంతో వివిధ గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 15రోజులుగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ఇప్పటికే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిముద్దయింది. ఇప్పుడే కోతకు వస్తున్న వరిపైరు నేలవాలింది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులకు.. వర్షంతో కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేల ఎకరాల్లో నష్టం



వరి పంట పరిశీలిస్తున్న ఏఈవోలు

వెల్గటూర్(ధర్మపురి): ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో వరి, 35 ఎకరాల్లో మొక్కజొన్న, 8 ఎకరాల్లో నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన వడ్లు నీట మునిగి, వరదకు కొట్టుకుపోయాయి. ఏఈవోలు వినోద్, ఫిర్దోజ్, మౌనిక సోమవారం క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, తద్వారా బాధితులకు పరిహారం వచ్చే అవకాశం ఉందని ఏఈవోలు విలేకరులకు తెలియజేశారు.

చిన్నారులు.. చిలిపి చేష్టలు

- సెలవులొస్తే చాలు.. అల్లరే అల్లరి
- 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో చదరంగం, నృత్యంపై శిక్షణ
- ప్రారంభమైన శిబిరాలు .. నేడు, రేపు కొనసాగింపు





మాట్లాడుతున్న జిల్లా క్రీడా, యువజన సంక్షేమాధికారి నరేశ్‌కుమార్, చెస్ ఆడుతున్న విద్యార్థులు

జగిత్యాలజోన్: వేసవి సెలవుల్లో చిన్నారుల అల్లరి చేష్టలు అన్నీఇన్నీ కావు.. ఎండలో ఆడుకోవడం.. ఈతకోసం చెరువుల్లోకి వెళ్లడం.. మొబైల్ ఫోన్లలో ఇష్టం వచ్చినట్లు ఆటలు ఆడటం.. టీవీల్లో కార్టూన్లు చూస్తూ సమయం వృథా చేసుకోవడం నిత్యకృత్యం .. ఇలాంటి చేష్టలతో తల్లితండ్రులకు కోపం తెప్పించడం తరచూ జరిగే తంతు. ఇలాంటి విద్యార్థుల మెదళ్లకు పదును పెట్టేందుకు 'సాక్షి' మీడియా గ్రూప్ కంకణం కట్టుకుంది. జిల్లా కేంద్రంలోని కిడ్జీ రూట్స్ పాఠశాల ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకూ మూడ్రోజులపాటు చదరంగం, నృత్యం వంటి రంగాల్లో శిక్షణ ఇస్తోంది. సోమవారం చదరంగంపై పలువురు విద్యార్థులకు శిక్షణ ప్రారంభించింది. ఆసక్తిగలవారు 80084 36363, 97053 46639 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలి.

చదరంగంతో మెదళ్లకు పదును..

చదరంగం శిక్షణ శిబిరం ప్రారంభించిన జిల్లా క్రీడా, యువజన సంక్షేమ అధికారి నరేశ్‌కుమార్ మాట్లాడుతూ, సమస్య ఏదైనా పరిష్కరించే మార్గాన్ని చదరంగం నేర్పిస్తుందన్నారు. చదరంగంలో నైపుణ్యం ప్రదర్శిస్తే.. ఏ ఆటలోనైనా విజయం సాధిస్తారని అన్నారు. చెస్ ద్వారా క్రమశిక్షణ, మనోస్థైర్యం పెంపొందుతాయని చెప్పారు. కిడ్జీ రూట్స్ పాఠశాల కరస్పాండెంట్ జిల్లా ఉమాకాంత్ మాట్లాడుతూ, సాక్షి మీడియాతో కలిసి శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చెస్ గోల్డ్ మెడలిస్ట్ శ్రీకాంత్ మాట్లాడుతూ, చెస్ సాధనతో పోరాడే పటిమ పెంపొందుతుందన్నారు. ఆర్గనైజర్ జగన్ మాట్లాడుతూ, చదరంగం ద్వారా ఒకసారి ఓడిపోతే, రెండోసారి విజయం సాధిస్తారన్నారు. ప్రిన్సిపాల్ శారద, 'సాక్షి' జిల్లా ఇన్‌చార్జి కె.శశిధర్, క్రైంరిపోర్టర్ జి.మల్లారెడ్డి, ఎల్‌జీ గార్డెన్ అధినేత రమేశ్ పాల్గొన్నారు.

చెస్ అంటే ఇష్టం



చెస్ ఆడడం ఇష్టం. సాక్షి పేపర్లో చూసి శిబిరానికి వచ్చిన. చెస్ ఎలా ఆడాలో మంచిగా నేర్పిస్తున్నరు. సమస్యల పరిష్కారం నేర్పిస్తున్నరు.

– పెద్ది కుందన, 9వ తరగతి

ఉల్లాసంగా ఉంది



చెస్ ఆడితే మెదడుకు ఉల్లాసం కలుగుతుంది. గతంలో అప్పుడప్పుడు చెస్ ఆడేవాన్ని. ఇప్పుడు గెలుపుపై అవగాహన పెంచుకుంటున్న.

– హన్మాన్ సాయి, 9వతరగతి

శిక్షణ మంచిది



సాక్షి మీడియా గ్రూప్‌తో కలిసి విద్యార్థులకు వేసవి సెలవుల్లో పలు రంగాల్లో శిక్షణ ఇస్తున్నాం. నచ్చిన రంగంలో శిక్షణ తీసుకోవాలి.

– శారద, ప్రిన్సిపాల్, కిడ్జీ రూట్స్ స్కూల్

వేడుకలు అధికారికంగా నిర్వహించాలి



మే డే వేడుకల్లో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ముక్రం
- ఘనంగా మే డే వేడుకలు

జగిత్యాల: ప్రపంచ దేశాల్లోని కార్మిక లోకానికి పండుగైన మే డేను అంతటా అధికారికంగా నిర్వహిస్తున్నారని, అదేతరహాలో మనదేశంలో కూడా ఉత్సవాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ముక్రం డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం మే డే ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, షికాగో నగరంలో వేలాది మంది కార్మికులు 18 గంటల పనిదినాన్ని నిరసించారన్నారు. బానిస బతుకుల విముక్తి కోసం పోరాడి 8 గంటల పనిదినాలు సాధించారని అన్నారు. కార్మికుల పోరాట ఫలితమే మే డే అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, శ్రీనివాస్, ధర్మయ్య, అల్తాఫ్, మహేశ్, రాజు, రాజగంగు, రహీమ, లక్ష్మి, సతీశ్ పాల్గొన్నారు.

కార్మికుల సమష్టి పోరాట ఫలితమే..

జగిత్యాలరూరల్: కార్మికుల సమష్టి పోరాట ఫలితమే మే డే అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఐఎన్‌టీయూసీ 327 ఆధ్వర్యంలో మే డే ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వెన్నంటి ఉంటేదది ఐఎన్‌టీయూసీ 327 అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన పథకాలను తెలంగాణ రాష్ట్రం స్ఫూర్తిగా, మార్గదర్శకంగా తీసుకుని మెరుగైన సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు తిరుపతిరెడ్డి, రాంజీనాయక్, ప్రమోద్‌శంకర్, రాజమౌళి, కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, కళ్లపల్లి దుర్గయ్య, బింగి రవి పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

క్లుప్తంగా

ధర్మపురి వాసికి శ్రమశక్తి అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజన్న

ధర్మపురి : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమంలో సింగరేణి కార్మికులను పాల్గొనే విధంగా కృషిచేసిన ధర్మపురి వాసి ఒడ్నాల రాజన్నకు సోమవారం రాష్ట్రప్రభుత్వం 2022–20023 సంవత్సరానికి శ్రమశక్తి అవార్డును అందజేసింది. రాజన్న అవార్డు రావడం పట్ల పట్టణవాసులు, మిత్రులు హర్షం వ్యక్తంచేశారు.

క్షుద్రపూజలు కలకలం..

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. కరీంనగర్ రోడ్డులోని లేబర్ అడ్డా వద్ద మహాలక్ష్మీ మెస్ ద్వారం ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి క్షుద్ర పూజలు చేశారు. మెస్ యజమాని అంజయ్య సోమవారం ఉదయం మెస్ తెరిచేందుకు రాగా షట్టర్ ముందు రక్తం, కుంకుమ, పసుపు, నిమ్మకాయలు కనిపించాయి. దీంతో ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుండెపోటుతో రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అత్తినేని చిన్న ఓంకార్ (75) సోమవారం సాయంత్రం గుండెపోటుతో నిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. పదవి విరమణ పొందడంతో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలు మంగళవారం జగిత్యాలలో నిర్వహించనున్నారు.

వివాహిత అదృశ్యం

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌కు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు సీఐ రాంచందర్‌రావు తెలిపారు. గతనెల 26న ఆమె ఇంట్లోంచి పనినిమిత్తం బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బాలికకు తీవ్రగాయాలు

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అప్సర (13)కు ప్రమాదవశాత్తు కడుపులో గ్లాసు గుచ్చుకొని తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన అప్సర తన సోదరితో కలిసి వైద్యుడి వద్దకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో అక్కడే ఉన్న గ్లాసు కడుపులో గుచ్చుకుంది. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనపై వివరాలు వెల్లడించేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గుర్రం జీవన్‌రెడ్డి (32) అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన గుర్రం జీవన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం టెంట్‌హౌస్ నిర్వహించాడు. అప్పులు ఎక్కువగా కావడంతో తన సోదరుడికి చెబుతూ బాధపడేవాడు. ఆదివారం రాత్రి భోజనం చేసి టెంట్‌హౌస్‌లోకి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు గుర్రం మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

ప్రతిపాదనలకే పరిమితమా?

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామాకేర్ యూనిట్ ఏర్పాటెప్పుడు?
- అవసరమైన శస్త్ర చికిత్స అందిస్తే బతికే అవకాశాలు
- రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- అధికారులు స్పందించాలని కోరుతున్న ప్రజలు



క్షతగాత్రుడికి చికిత్స చేస్తున్న వైద్యులు

జగిత్యాల : జగిత్యాల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 20 మండలాలు, ఐదు మున్సిపాలిటీలతో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి సైతం ఎంతోమంది రోగులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. జిల్లాకేంద్రం కావడం, ఆస్పత్రి పరిధి పెరగడంతో ప్రతి పెద్ద సంఖ్యలో రోగులు ఈ ఆస్పత్రికే వస్తుంటారు. కానీ ఆస్పత్రిలో మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారి కోసం ఉపయోగపడే ట్రామా కేర్ యూనిట్ లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి తక్షణమే ఈ యూనిట్ ద్వారా చికిత్స అందిస్తే బతికే అవకాశాలు ఉంటాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల్లో గాయపడ్డ వారికి తక్షణమే వైద్య సహాయం అందించాలనే ఉద్దేశంతో ప్రతి ఆస్పత్రిలో ట్రామాకేర్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. కానీ ఇప్పటి వరకు ఏ ఆస్పత్రిలో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయలేదు. జిల్లా కేంద్రంలో రోజుకు 10 నుంచి 20 రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. రోడ్డు ప్రమాదాలకు గురైనవారిని ప్రైవేట్ ఆస్పత్రిలో ఎక్కువ శాతం చేర్పుకోరు. కచ్చితంగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికే తరలించాలి. కాగా వీరికి అత్యవసర చికిత్స అందించాలంటే ఈ సెంటర్ ఎంతో ముఖ్యం.

ట్రామాకేర్ యూనిట్‌తో ఉపయోగాలు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు వైద్యం అందించే మొదటి గంట అమూల్యమైంది. ఈ సమయంలో వైద్యసేవలు సరైన శస్త్ర చికిత్స అందించి ప్రాణాలు కాపాడుకోవచ్చు. ప్రమాదాల్లో గాయపడిన వారికి తీవ్రమైన రక్తస్రావం జరుగుతుంది. మానసిక ఆందోళనకు గురవుతారు. ఇటువంటి వారికి గంటలోపు వైద్యసేవలందించి అవసరమైన శస్త్ర చికిత్స అందించేందుకు ఈ యూనిట్ ఎంతో ఉపయోగపడుతుంది.

ప్రత్యేక సిబ్బంది

ఈ సెంటర్ ఏర్పాటు చేస్తే దీనికి ప్రత్యేకమైన సిబ్బంది ఉంటారు. ట్రామాకేర్ సెంటర్‌లో ఆర్థోపెడిక్‌తో పాటు అనస్థీషియా, నర్సు తదితర సిబ్బంది ఉంటారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఈ సెంటర్‌ను జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాద బాధితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అమలుకు నోచుకోని ట్రామాకేర్..

గతంలో జిల్లా ప్రజాప్రతినిధులు ట్రామాకేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కానీ అమలుకు నోచుకోలేదు. గతంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని సైతం పరిశీలించారు. కానీ దానికి ప్రత్యేకమైన సిబ్బంది కావాల్సి ఉండటంతో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు రానట్లు తెలిసింది. జిల్లా కేంద్రం కావడంతో పాటు, పరిధి సైతం పెరగడంతో అత్యధికంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. గాయపడ్డ వారికి ఈ సెంటర్ ఉంటే బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు తెలుపుతున్నారు. కానీ ఏర్పాటు చేయడంలో చొరవ చూపడం లేదు. ఇటీవలే వైద్య కళాశాల సైతం ఏర్పాటు కావడం, త్వరలోనే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో ఈ ట్రామాకేర్ ఉంటే మరింత మెరుగైన వైద్యం అందే అవకాశాలుంటాయి. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి జగిత్యాలలో ట్రామాకేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఏర్పాటు చేయాలి



జగిత్యాలలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. క్షతగాత్రులను జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తే వైద్యం అందక చనిపోతున్నారు. ఈ ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుంది. ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– కల్యాణ్ చక్రవర్తి, జగిత్యాల

ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి



జగిత్యాల చుట్టూ రోడ్లన్నీ విశాలంగా, తారురోడ్లు వేయడంతో ప్రమాదాలు సైతం ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగిన వారిని ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రికే తరలిస్తుంటారు. ప్రైవేటులో చేర్పించుకోరు. ఇందుకోసం ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేలా చూడాలి.

– కిరణ్‌కుమార్, జగిత్యాల

బాధితులకు ఎంతో మేలు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాద బాధితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయాలంటే అత్యంత ఖర్చుతో కూడుకోవడంతో పాటు ప్రత్యేక సిబ్బంది ఉండాలి. జగిత్యాలలో ఎక్కువశాతం రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. త్వరలోనే ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

– రాములు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

పరిశ్రమతో చరిత్ర కాలగర్భంలో కలుస్తుంది

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



ర్యాలీగా వెళ్తున్న ప్రొఫెసర్ కోదండరాం

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమ స్థాపిస్తే ఇక్కడి చారిత్రక ప్రాంతం కాలగర్భంలో కలిసిపోతుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆందోళన వ్యక్తం చేశారు. స్తంభంపల్లి శివారులో చేపట్టిన ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నెల రోజులుగా ఉద్యమిస్తున్న పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులను ఆయన సోమవారం కలుసుకుని సంఘీభావం తెలిపారు. పరిశ్రమ ప్రతిపాదిత స్థలం పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. బౌద్ధులు నడయాడిన నేల, శాతవాహనులు పాలించిన తొలి రాజధాని కోటిలింగాలకు గొప్ప చరిత్ర ఉందన్నారు. కర్మాగారంతో కాలుష్యం వెదజల్లి చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియకుండా పోతుందని అన్నారు. గాలి, నీరు, భూగర్భ జలాలు, గోదావరి జలాలు కలుషితమవుతాయని అన్నారు. చర్మ, శ్వాసకోశ సంబంధ వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. ఇలాంటి పరిశ్రనును రద్దుచేసేంత వరకూ గ్రామస్తులకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు, నీట మునిగిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షపునీటికి కొట్టుకుపోతుంటే ఏ నాయకుడూ రావడంలేదని విమర్శించారు. కానీ పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజలు వ్యతిరేకించే పరిశ్రమ నిర్మించడం శోచనీయమన్నారు. తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి, అడ్వకేట్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కిడ్నాప్‌కు పాల్పడిన ఎనిమిది మందిపై కేసు

సారంగాపూర్: బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్వాయి గ్రామంలో ఓ వ్యక్తిని, మరో యువతిని కిడ్నాప్ చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు బీర్‌పూర్ ఎస్సై అజయ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన అరుణ (30), భర్త శ్రీనివాస్, పిల్లల్ని వదిలేసి బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన లింగయ్య (24) వద్ద కొన్ని నెలలనుంచి ఉంటోంది. సోమవారం అరుణ భర్త శ్రీనివాస్, అతని బంధువులు కొల్వాయి గ్రామానికి చేరుకున్నారు. లింగయ్య కుటుంబ సభ్యులను కట్టేసి అరుణతో పాటు, లింగయ్య తండ్రి లచ్చం (50)ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారి వాహనాన్ని వెంబడించి మంచిర్యాల వద్ద కిడ్నాప్ అయిన లచ్చంను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. కిడ్నాప్ చేసిన ఎనిమిది మందిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడిన శ్రావణ్‌కుమార్

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ముప్పిరితోటకు చెందిన శ్రావణ్‌కుమార్(33) అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గీత వృత్తిలో భాగంగా శ్రావణ్‌కుమార్ సోమవారం ఉదయం తాటిచెట్టు ఎక్కి, కల్లు గీస్తున్నాడు. ఆ సమయంలో మోకు జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గీత కార్మికులు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్లు శ్రావణ్‌కు మెదడులో రక్తం గడ్డ కట్టడంతోపాటు, ముఖానికి, తలకు బలమైన గాయాలయ్యాయని తెలిపారు. వారి సూచనతో బాధిత కుటుంబీకులు అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాతోపాటు వైద్య ఖర్చుల నిమిత్తం బీసీ కార్పొరేషన్ నుంచి ఇచ్చే రూ.15 వేలను వెంటనే అందజేయాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర న్యాయ సలహాదారు చీకటి సంతోష్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పల్లెర్ల శారద, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు పూరెల్ల మొండయ్యగౌడ్ కోరారు.

పరిహారానికి ఆర్థికశాఖ ఆమోదంపై హర్షం

సుల్తానాబాద్(పెద్దపల్లి): అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపడంపై మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు. సంబంధిత ఫైల్‌పై సంతకం చేసినందుకు సోమవారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్ రావును నూతన సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. బోధనాసుపత్రుల్లో 1,827 స్టాఫ్‌నర్సుల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఫైల్‌పై సంతకం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

నివేదిక అందించాలి

జగిత్యాల: ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజేషన్ కోసం ఇంటెలిజెన్స్ విభాగం ఉపాధ్యాయుల జాబితాను జిల్లాలోని మండల విద్యాధికారులకు పంపించామని, ఉపాధ్యాయులు నివేదిక అందించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ సర్వీస్ బుక్, ప్రొఫార్మాలతో సర్వీస్ వివరాల పరిశీలనకు హాజరు కావాలన్నారు.

గోదావరిఖని వాసికి డాక్టరేట్

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖనికి చెందిన దగ్గుల కిరణ్మయికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. వర్సిటీ సైన్స్ కళాశాల జంతుశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ జి.మారుతీరామ్ పర్యవేక్షణలో బీటీ పత్తి రసం పీల్చే పురుగులపై కరీంనగర్ జిల్లాలో చేసిన పరిశోధనలు, సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను ఆమెకు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు కిరణ్మయిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ మృతి



నివాళి అర్పిస్తున్న ఎస్పీ భాస్కర్



వేదశ్రీ(ఫైల్)

మల్యాల(చొప్పదండి): విధి నిర్వహణలో పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వెళ్లిన మహిళా కానిస్టేబుల్ వాహనం పైనుంచి పడి మృతిచెందిన సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. జీవో నంబరు 370లో భాగంగా సిరిసిల్ల నుంచి మల్యాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన వేదశ్రీ(30).. కొద్దిరోజులుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై బయటకు బయలుదేరారు. స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోయారు. ఈఘటనలో వేదశ్రీ తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. స్థానికులు జగిత్యాల ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందారు. మృతురాలికి భర్త రామకృష్ణ, కుమారుడు అకున్ వైద్యరామన్ ఉన్నారు. వేదశ్రీ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

నివాళి అర్పించిన ఎస్పీ

జగిత్యాలక్రైం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ టి.వేదశ్రీ మృతదేహానికి స్థానిక ఆస్పత్రిలో ఎస్పీ భాస్కర్ నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎస్పీ వెంట సీఐలు రాజశేఖర్‌రాజు, రమణమూర్తి, ఎస్సై చిరంజీవి ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పన్నాల తిరుపతి రెడ్డి

రాయికల్: అకాలవర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రామారావుపల్లి, ఇటిక్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, సింగిల్‌విండో చైర్మన్ మహిపతి రెడ్డి, యువ మోర్చా జిల్లా కార్యదర్శి ఏలేటి జలేందర్ రెడ్డి, నాయకులు బందెల మల్లన్న, సంజీవ్‌రెడ్డి, అంజి, రవి, రొట్టె శ్రీధర్, శేఖర్, జీవన్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కొనుగోళ్లలో జాప్యం

జగిత్యాల రూరల్: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, చిలుకమర్రి మదన్‌మోహన్ అన్నారు. మండలంలోని గుల్లపేటలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, నాయకులు తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



కమలాపూర్‌లో పంటపొలాన్ని పరిశీలిస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి : అకాలవర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కమలాపూర్‌లో ఈదురుగాలులు, అకాలవర్షాలతో నేలవాలిన పంటపొలాలు, ధర్మపురి మార్కెట్‌యార్డులోని ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కంటే ఈసారి పంటల సాగుకు రైతులు ఎక్కువమొత్తంలో పెట్టుబడి పెట్టారన్నారు. అధికారులు పర్యవేక్షించి రైతులకు మనోధైర్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. సీఎం కేసీఆర్ ఎకరానికి రూ.పదివేలు చొప్పున పరిహారాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతుల విషయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధ్యత తీసుకొని ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చొరవ చూపాలన్నారు. నాయకులు సింహరాజు ప్రసాద్, రాందేని బాపు, వేముల రాజు, అప్పం తిరుపతి, సీపతి సత్యనారాయణ, చిలుముల లక్ష్మణ్, తదితరలున్నారు.

కొడుకును చంపిన తండ్రికి యావజ్జీవ శిక్ష

- సహకరించిన తాతకు సైతం...

జగిత్యాలజోన్ : కొడుకును చంపిన తండ్రికి యావజ్జీవ శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమా సోమవారం తీర్పుచెప్పారు. హత్యకు సహకరించిన తాతకు సైతం యావజ్జీవ శిక్ష విధించగా ఈ కేసులో మూడవ నిందితురాలిగా ఉన్న బైరి పద్మను నిర్దోషిగా విడుదల చేస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. పెగడపల్లి మండలంలోని దోమలకుంటకు చెందిన నక్క రమేశ్‌కు అదే గ్రామానికి చెందిన గంగవ్వతో 21ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. నక్క రమేశ్ ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లగా ఇంటికి డబ్బులు పంపించేవాడు కాదు. జనవరి, 2019లో రమేశ్ స్వగ్రామానికి వచ్చాడు. డబ్బుల విషయంలో భార్య గంగవ్వ, కొడుకు జలేందర్ రమేశ్‌ను నిలదీశారు. దీంతో గొడవకు దిగడంతో పాటు పొలం వద్దకు వెళ్తే ఇద్దరిని చంపుతానని రమేశ్ బెదిరించాడు. తల్లి, కొడుకు జలేందర్ పొలానికి వెళ్లి పంటను కోశారు. దీంతో నవంబర్ 12, 2019న గంగవ్వ, జలేందర్‌ను కత్తితో పొడిచాడు. దీనికి తాత రాయమల్లు సైతం సహకరించాడు. ఈ ఘటనలో జలేందర్ అక్కడికక్కడే మృతిచెందగా గంగవ్వను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గంగవ్వ ఫిర్యాదు మేరకు భర్త రమేశ్‌తో పాటు హత్యకు సహకరించిన మామ రాయమల్లు, ఆడబిడ్డ బైరి పద్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ కిశోర్ కేసు దర్యాప్తు చేయగా ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో నక్క రమేశ్, నక్క రాయమల్లుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసులో మూడవ నిందితురాలిగా ఉన్న బైరి పద్మను నిర్దోషిగా విడుదల చేస్తూ తీర్పునిచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1986–87 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివినవారు సోమవారం కాల్వశ్రీరాంపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. చిన్ననాటి మిత్రులను ఇన్నేళ్ల తర్వాత చూసి, భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషంగా గడిపారు. అందరూ కలిసి భోజనం చేశారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.